# అంగర కృష్ణారావు

## బంధం లేని అనుబంధం
(మినీ కథ)



టెలిఫోన్ నిర్విరామంగా మోగుతోంది.

చూస్తున్న అర్జెంట్ ఫైల్ మూసి విసుగ్గా ఫోను అందుకున్నాడు సత్యమూర్తి.

"హలో!... ఆ... అవును... సత్యమూర్తినే మాట్లాడుతున్నాను. ఏమిటి...అలాగా...జస్టేమినిట్... ఇప్పుడే వస్తున్నాను."

ఫోన్ క్రెడిల్ మీదుంచి టేబిల్ మీదున్న ఫైళ్ళు చకచకా లాకర్‌లో సర్ది పరుగువంటి నడకతో బయటపడి పది నిమిషాల్లో ఆటోలో హాస్పిటల్ చేరుకున్నాడు.

అదురుతున్న గుండెలతో కార్డియాలజీ వార్డులోని ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లోకి అడుగు పెట్టిఅక్కడి డాక్టర్‌కి తన్ను తాను పరిచయం చేసుకున్నాడు.

గుండె నొప్పితో రోడ్డుపక్కగా పడి వుండగా ఎవరో పుణ్యాత్ములు హాస్పిటల్లో ఎడ్మిట్ చేశారని- అతి కష్టంమీద మీ పేరు చెప్పగా- మీకు ఫోన్ చేశామని తన సహజధోరణిలో చెప్పుకుపోయాడు డాక్టర్.

ఆ బెడ్‌మీద పడుకునివున్న పేషెంట్ ఏభై- ఏభై అయిదేళ్ళ వ్యక్తి. బక్కచిక్కి శల్యావశిష్టంగా వున్నాడు. గుండె నొప్పితోలుంగలు చుట్టుకు పోతున్నాడు.

పరిస్థితి చాలా సీరియస్‌గావుంది.

"సిస్టర్! పేషంట్‌కి పెథిడ్రిన్ ఇంజక్షన్ ఇచ్చారు కదా. ఆక్సిజను పెట్టండి. గ్లూకోజ్ డ్రిప్ స్టార్ట్ చెయ్యండి. రక్తపోటు చాలా తక్కువగా వుంది. అందులో ఒన్ యాంపూల్ యేఫెంటినికూడా కలిపండి. ఈ లోపల సోడియంబైకార్బనేట్ ఇంజక్షన్ తీసుకురండి" తొందర తొందరగా సూచనలిస్తున్నాడు డాక్టర్.

పరిస్థితి అర్థం చేసుకున్నాడు సత్యమూర్తి.

"బాబూ సత్యం!" అరమోడ్పు కళ్ళతో అస్పష్టంగా గొణుగుతున్నాడు వృద్ధుడు. తన కర్తవ్యం స్ఫురించింది సత్యమూర్తికి.

"నాన్నా!" అంటూ వృద్ధుని రెండు చేతులూ తన చేతిలోకి తీసుకుని అన్యమనస్కంగా బెడ్‌పక్కనే కూర్చుండిపోయాడు.

హౌస్ సర్జన్, నర్స్ కలిసి ఆక్సిజన్ ఫ్లాక్స్ పట్టుకువచ్చారు. రోగికి ఆక్సిజన్ ఎక్కిస్తున్నారు. గ్లూకోజ్ డ్రిప్ స్టార్ట్ చేశారు. ఇ.సి.జి. ఏపరేటస్ నిర్విరామంగా గుండె కదలికలను రికార్డు చేస్తోంది.

గంటలు గడుస్తున్నా రోగి పరిస్థితిలో మార్పులేదు.

అర్ధరాత్రి దాటి ఒంటి గంటైంది. హాస్పిటల్ మెల్లమెల్లగా నిద్రావస్థలోకి జారుకుంటోంది. చాలామందిరోగులు నిద్రపోతున్నారు. కొంతమంది నిద్ర పట్టక అటూ ఇటూ కదులుతున్నారు. మరికొంత మంది బాధతో మూలుగుతున్నారు.

చూస్తుండగానే వృద్ధుని పరిస్థితి విషమించింది. శరీరమంతా చెమటలు పట్టి ధారగా ప్రవహిస్తున్నాయి. వెంటవెంటనే రెండు వాంతులుకూడా అయినాయి.

పల్స్ చూసి డాక్టర్ పెదవి విరిచాడు.

"అయినా మన ప్రయత్నం మనం చేద్దాం" అంటూ చప్పున రోగి పక్కన కూర్చుని గట్టిగా ఛాతీ ఒత్తుతూ- కార్డియాక్ మసాజ్ చేయసాగాడు.

డాక్టర్, హౌస్ సర్జన్ కలిసి ఓ అరగంటసేపు విశ్వప్రయత్నం చేశారు. గబగబా ఏవో ఇంజక్షన్లు చేశారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

కొన్ని గంటలుగా బాహ్యస్మృతి లేకుండా మృత్యువుతో పోరాటం సాగిస్తున్న ఆ నిర్భాగ్యపు శరీరంలోని ప్రాణి జీవితయానం ముగించి ఏ జ్ఞాపకాలూ, బాధలూ అంటని నిరామయ సుషుప్తిలోనికి వెళ్ళిపోయింది.

"అయామ్ సారీ మిస్టర్‌మూర్తి! హి ఎక్స్‌పైర్డ్" చెప్పకతప్పదన్నట్లు చెప్పి మౌనంగా అక్కడినుండి వెళ్ళిపోయాడు డాక్టర్.

సిస్టర్ వెళ్ళి మరణించిన వ్యక్తి ముఖం మీద తెల్లటి దుప్పటి కప్పి, పక్క పేషెంట్లకు ఇబ్బందిలేకుండా మంచం చుట్టూ స్క్రీన్‌అమర్చింది.

మెల్లిగా మంచం పక్కనుండి కదిలి బరువుగా అడుగులు వేస్తూ టేబిల్‌దగ్గరకువెళ్లాడుసత్యమూర్తి.

అప్పుడే డెత్ సర్టిఫికెట్ తతంగం ముగించిన డాక్టర్ తలెత్తి "బాడీని తీసుకుపోవచ్చు. మీరీ వూరికి కొత్తనుకుంటాను. అవసరమైతే మా వార్డ్ బోయ్ మీ కన్ని విధాలా సాయం చేస్తాడు" అన్నాడు.

"...క్షమించండి డాక్టర్! చనిపోయిన పేషెంట్ మా నాన్నగారు కాదు."

"వ్వాట్?...ఆయిన మీఫాదర్ కాదా?" ఈసారి ఆశ్చర్యపోవడం డాక్టర్ వంతయింది.

"అయితే ఆయన విషయంలో మీరెందుకింత శ్రద్ధతీసుకొన్నారు".

"నేనేకాదు డాక్టర్! మానవత్వం వున్న ఏ మనిషైనా ఆ సమయంలో అలాగే ప్రవర్తిస్తాడేమో! అతన్ని చూడగానే యెక్కడో పొరపాటు జరిగిందని తెలుసుకున్నాను. అతనికా సమయంలో తన కొడుకు సమక్షంకావాలి. అతన్నున్న పరిస్థితుల్లో నన్ను గుర్తు పట్టలేదు. ఆ సమయంలో అతనికినాఅవసరం వుందని గ్రహించాను. ఓ కన్నతండ్రి పట్ల మానవత్వంవున్న కొడుకులా ప్రవర్తించాను."

సత్యమూర్తి గొంతుగాద్గదికమైంది. రెండు కన్నీటిబొట్లురాలి నేలమీద పడి యింకిపోయాయి.

చివరి క్షణాల్లో తన కొడుకు చేతిలో శాంతిగా కళ్లుమూస్తున్నాన్న తృప్తి ఆ వృద్ధుని కళ్ళలో ద్యోతకమైంది.

వృద్ధుని అంత్యక్రియల నిమిత్తం రెండు ఏభై రూపాయల నోట్లు వార్డు బోయ్ చేతిలో వుంచి మౌనంగా వీధిలో కలసిపోయాడు సత్యమూర్తి- మానవత్వం వున్న మమతామూర్తి. *